## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-01-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- రక్షణ, అంతరిక్షం, పెట్టుబడి రంగాలలో సహకారాన్ని పెంపొందించడానికి భారత్, యుఏఇ దేశాలు ఈరోజు ఒప్పందంపై సంతకాలు చేశాయి.
- ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు పోలండ్ దేశం, భారత్ తో కలసి పనిచేయాలని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కోరారు.
- దేశంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు 2024-25 సంవత్సరంలో 2 వేల 700 కోట్ల రూపాయలకు పైగా లాభాన్ని నమోదు చేశాయని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

= = = = = = = = = = = = = = = = = = =

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత పర్యటన సందర్భంగా ఢిల్లీ విమానాశ్రయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆయనకు స్వాగతం పలికారు. యుఎఇ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇది ఆయన మూడవ అధికారిక పర్యటన, కాగా, గత దశాబ్దంలో భారత్ లో ఐదవ పర్యటన. ఈ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో షేక్ మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌తో ప్రతినిధి బృందం స్థాయి చర్చలు జరిపారు. సమావేశ వివరాలను విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వివరిస్తూ... రక్షణ, అంతరిక్షం, పెట్టుబడి రంగాలలో సహకారాన్ని పెంపొందించడానికి భారత్, యుఎఇ ఒప్పందాలపై సంతకం చేశాయన్నారు. ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ఈ సమావేశం దోహదపడిందని విక్రమ్ మిస్రీ పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు భారత్ తో కలసి పని చేయాలని పోలండ్ ను భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ కోరారు. పోలండ్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి అయిన రాడోస్లావ్ సికోర్స్కీ తో జైశంకర్ ఈరోజు ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలపై చర్చలు జరిపారు. అనంతరం జైశంకర్ మాట్లాడుతూ, ఉగ్రవాదాన్ని భారత్ ఎప్పుడూ వ్యతిరేకిస్తూనే ఉంటుందని.. భారత్‌తో స్నేహాన్ని కోరుకునే దేశాలు ఉగ్రవాదంపై మెతక వైఖరి వీడాలన్నారు. ప్రపంచ దేశాలకు ముప్పుగా పరిణమిస్తున్న ఉగ్రవాదానికి ఆజ్యం పోసేందుకు ఎటువంటి సహాయం చేయకూడదని స్పష్టం చేశారు. భారత్, పోలెండ్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు స్థిరంగా ముందుకు సాగుతున్నాయని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్…31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కమ్‌లు) 2024-25 సంవత్సరంలో 2 వేల 700 కోట్ల రూపాయలకు పైగా లాభాన్ని నమోదు చేశాయని కేంద్ర విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని ఐఐటీ ఢిల్లీ క్యాంపస్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పవర్ అండ్ రెగ్యులేషన్ ప్రారంభం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ, దేశానికి ప్రయోజనం చేకూర్చే ముఖ్యమైన నియంత్రణ సంస్కరణలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యుత్ రంగంలో తీసుకువస్తుందని తెలిపారు. విద్యుత్ రంగంలో నష్టాలను నివారించడానికి ప్రభుత్వం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో విద్యుత్ చట్టంలోని సవరణను ప్రవేశపెడుతుందని పేర్కొన్నారు. భారతదేశం స్వంత నిబంధనలను ఏర్పరచుకొని ఇతర దేశాలకు కూడా నిర్దేశించే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 130వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 23వ తేదీ సాయంత్రం వరకు పంపించవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =

జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (NDRF) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్షోభ సమయాల్లో ఎంతో నైపుణ్యంతో, దృఢ సంకల్పంతో నిలబడే NDRF మహిళా, పురుష సిబ్బందికి దేశం తరపున కృతజ్ఞతలు తెలిపుతున్నట్లు సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా NDRF సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ జి రామ్ జి చట్టంపై కాంగ్రెస్ పార్టీ అనవసరపు ఆరోపణలు చేస్తుందని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి మాట్లాడుతూ.. కొత్త చట్టం ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబానికి గతంలో ఉన్న 100 రోజుల ఉపాధిని 125 రోజులకు పెంచుతూ ప్రభుత్వం హామీ ఇస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ కృషితో దేశంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి విముక్తి పొందారని మంత్రి పేర్కొన్నారు. 'వికసిత్ భారత్ జి రామ్ జి చట్టంలో ఎస్సీ, ఎస్టీ మహిళలు, దివ్యాంగులు, పేదలకు అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చారని, నిర్ణీత సమయంలోగా పని కల్పించలేకపోతే, కొత్త చట్టం ప్రకారం నిరుద్యోగ భృతి ఇచ్చే నిబంధన కూడా ఉందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొంటూ…

(వాయిస్…29 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

న్యూఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో ఈనెల 26న జరిగే 77వ గణతంత్ర దినోత్సవ కవాతును వీక్షించడానికి వివిధ రంగాల నుండి సుమారు 10 వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించినట్లు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఆదాయం, ఉపాధి కల్పనలో ఆదర్శప్రాయమైన కృషి చేసినవారు, ఉత్తమ ఆవిష్కర్తలు, పరిశోధకులు, స్వయం సహాయక బృందాలు, ప్రభుత్వ కీలక కార్యక్రమాల కింద ఉత్తమ ప్రదర్శన కారులు ఆహ్వానించిన వారిలో ఉన్నారు. జాతి నిర్మాణానికి వారి సహకారాన్ని గౌరవించడం, జాతీయ ప్రాముఖ్యత కలిగిన కార్యక్రమాలలో జన భాగీదారీని పెంచడం అనే లక్ష్యంతో వారందరినీ ఆహ్వానించారు.

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని యువతను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దడంలో NCC ప్రముఖ పాత్ర పోషిస్తుందని నావికాదళ ప్రధానాధికారి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి అన్నారు. న్యూఢిల్లీలోని నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (NCC) గణతంత్ర దినోత్సవ శిబిరం-2026ను ఆయన ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా NCC క్యాడెట్లను ఉద్దేశించి అడ్మిరల్ త్రిపాఠి మాట్లాడుతూ.. విపత్తు, పర్యావరణ పరిరక్షణతో పాటు దేశ నిర్మాణంలో NCC క్యాడెట్లు ఎంతగానో

సహకరిస్తున్నారని అన్నారు. NCC ద్వారా పెంపొందించబడిన విలువలు జీవితాంతం నిలిచి ఉంటాయని స్పష్టం చేశారు. వికసిత్ భారత్ నిర్మాణంలో క్యాడెట్లు ముఖ్య పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొంటూ...

(వాయిస్...23 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

పర్యావరణ, ఆర్థిక భద్రతకు అండమాన్ & నికోబార్ దీవుల జీవ వైవిధ్యం ఎంతో  కీలకమని కేంద్ర సైన్స్ & టెక్నాలజీ శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. శ్రీ విజయ పురంలోని అండమాన్ & నికోబార్ ప్రాంతీయ కేంద్రమైన జూలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ZSI)ని కేంద్రమంత్రి ఈరోజు  సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అండమాన్ & నికోబార్ దీవులు "జీవవైవిధ్యానికి సజీవ ప్రయోగశాల" అని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =